# 'హృదయేశ్వరి'

'పల్లపోతు'

"ఊరు మాటు మణిగింది; బాగా చీకటి పడిపోయింది. ఆ నిశీధపువేళలో భయంకరమైన ఉరుముల గర్జనలు ఈ ప్రపంచాన్నే భయకంపితముచేశాయి. ఆనందాతిశయములో ఉప్పొంగుతూ వున్న కప్పల బెక, బెకలూ, అప్పుడప్పుడూ తమ ఉద్రేకాన్ని ప్రకటిస్తున్న ఉరుముల పెళ, పెళ ధ్వనులూ తప్ప మరేమీ వినిపించటంలేదు. దైవానికి కొంచెం కనికరం కల్గింది కాబోలు వర్షంమాత్రం తగ్గి తుంపర్లు పడుతున్నవి. ఆవర్షపు నీటి ప్రవాహంలో పేదల తాటియాకు కొంపలు కాగితపు పడవల్లా తేలియాడుతున్నవి. ధనికులరత్నాల భవనాలు మాత్రం చెక్కు చెదరకుండావుండి, నీటిప్రవాహంలో కొట్టుకుపోతున్న పూరి కొంపలను వెక్కిరిస్తున్నవి. కానీ 'మేమింకా వెళ్ళలేద'ని తెలియబరుస్తున్న ఉరుముల పెళ, పెళ, ధ్వనులకు పసిపిల్లలు కెవ్వున కేకలేసి తల్లుల ఒడులలోకి జొచ్చుకుంటున్నారు. ఇంతలో హఠాత్తుగా వినిపించిన దొక అనాథ అబల ఆర్తనాథం! ... ఎవరు? రాజీ! ... నిజమేనా? అవును ; నిజమే! ... అది రాజీదే! నాకు బాగాగుర్తు!...

♦ ♦ ♦

రాజీ నా బంధువూగాదు ; కనీసం నా కులమూగాదు. కానీ, ప్రత్యక్షంగా చూడలేక పోయినా, చెప్పుడు మాటలకు చెవులనందించి, అసత్యాన్ని సత్యంగా వెద జల్లుతూ, నిరపరాధుల్ని అపరాధులుగా జమకట్టే ఈ లోకుల నోళ్ళల్లో రాజీ చెడ్డగానే నానింది. రాజీ మా ఊరొచ్చిన మొదట్లో నలుగురూ నాలుగు విధాలుగా ఆడి పోసుకున్నారు. రాజీని తుచ్ఛురాలుగా, అంటరాని దానిగా భావించారు. అదే నాకు లోకులపై అసహ్యం, రాజీపై అభిమానం ఒకేసారి కల్గించింది. ఈ లోకానికి చెవులున్నవే కానీ, కళ్ళులేవు. లోకంభావించినంతగా, ఊహించినంతగా నీచురాలు మాత్రం గాదు రాజీ, ఆమె నిర్దోషియని నా హృదయం చెప్తుంది.

రాజీ అంటే నాకెంతో అభిమానం. ఆ అభిమానమే ప్రేమగా మారినా, ఇంత ప్రళయానికి దారి తీస్తుందని నేనెన్నడూ ఊహించలేదు. రాజీ కోసంఇంత త్యాగం చెయ్యాలనే తలంపూలేదు; రాజీని పెండ్లి చేసుకుంటాననీ, రాజీలేకపోతే నాకీ ప్రపంచమే అంధకారమనీ, తనకిష్టం లేకుండా రాజీని చేసుకోవటం నాకూ కష్టంగా వుందనీ, మా వివాహానికి అంగీకరించమనీ, మా జీవితాలు నాశనం చేయవద్దనీ, మా

నాన్నను ప్రాధేయ పడ్డాను, అందుకు మా నాన్న 'వీల్లేద'ని, నా కోసం తమ వంశగౌరవాన్ని, కులప్రతిష్టను పాడుజేసు కోననీ, తనకు వ్యతిరేకంగా ప్రవర్తిస్తే ఆస్థిలో చిల్లిగవ్వగూడా దక్కదనీ, కచ్చితంగా, నిర్మొహమాటంగా చెప్పారు. వారి గౌరవానికి నా సౌఖ్యాన్ని నాశనం చేసుకోలేక పొయ్యాను. వారి ఆస్థిపాస్థులకు మనసారా ప్రేమించిన 'హృదయేశ్వరి'ని బలిచేయలేక పొయ్యాను.

విధివిలాసం! అంతా కార్యక్రమంగా జరిగిపోయింది; రాజీకోసం కన్న తలిదండ్రులను, ఇతర బంధువులనూ, ఆస్థిపాస్థులనూ కాలదన్ని రాజీని పెళ్లిచేసుకున్నాను. మా హృదయాల్లోపొంగిపొర్లి పోయిన అమృతధారలే, మా తల్లిదండ్రుల కన్నీటి ప్రవాహాలుగా రూపొందినవి; మేము ఉక్కిరి, బిక్కిరయినా సంతోషసాగరమే; మా తల్లితండ్రులకు దుఃఖసముద్రంగా మారిపోయింది; మా ఆదర్శ దాంపత్యాన్ని వెలివేసి, మమ్మల్ని చులకనగ జూచిన సంఘాన్ని చూచి మాలోమేము నవ్వుకునే వాళ్లం;

ఉదయాన్నే సత్రంనుండి లేవటం, పంపులో నీళ్లు నిండుగా పట్టించటం, కాళ్లు కండెలు కట్టేంతవరకూ తారు రోడ్లపై తిరగడటం, 'నోవేకన్సీ' బోర్డులు దర్శనం చేసుకోవటం, దినచర్య అయిపోయింది; వచ్చిన మొదటి వారంలోనే, తెచ్చినడబ్బు కర్పూరంలా కరిగిపోయింది. వంట్లో బలహీనత ఎక్కువయింది; కాళ్లు పీక్కుపోయాయి, గడ్డం బాగా పెరిగిపోయింది; బట్టలు పూర్తిగా మాసిపోయాయి; నాపై నాకే అసహ్యం వేసింది; ఏదిఎలావున్నా రాజీని చూడకుండా క్షణం గడపటం దుర్భరమైంది; అనుకోకుండా నే రైలెక్కాను. 'టికెట్ కలెక్టరు'ని చూసేంతవరకూ నేను 'టికెట్' తీసుకోలేదన్న విషయం జ్ఞప్తికేరాలేదు;

పదిహేను రోజుల 'జైలు' సర్వీసుతో కొంపముఖం పట్టాను. అన్యకుల స్త్రీని వివాహం చేసుకుని, మణిపూసలాంటి కుటుంబగౌరవాన్ని మంటగలిపి, నలుగురిచే 'ఛీ' అనిపించుకున్న దానికంటే, నాకిది ఏమంత 'పెద్ద' సిగ్గు'గా కన్పించలేదు; ఇంట్లో అడుగు పెట్టాను. అంతా నిశ్శబ్ధమయం. తాకట్టుకుపోగా మిగిలిన వస్తువులు గూడా నాటితో మాయమయ్యాయి కాబోలు అంతాబోసిగావుంది; పొయ్యిలో పెంపుడు పిల్లి 'నేను విశ్వాసంగలదానిని' అన్నట్లు కునికిపాట్లు పడుతుంది? పడకగది నిండా సాలీడు అల్లినగూళ్లు నల్లగా కరిదూపంరాలిన పట్టెమంచంపై తెల్లని కవరొకటుంది. భయంగా, ఆదుర్దాగాదాన్ని విప్పాను ... అందులో.

నాగేశ్వరం!

నాకోసం కన్న తల్లిదండ్రుల కడుపులో కోత పెట్టిన వాడవు, నాకంటే అందమయిన స్త్రీకోసం నా జీవితాన్ని మాత్రం నట్టేటిలోముంచవన్న నమ్మకం ఏమిటి? ... నేను నీలా నా వారిని కాదని నీతోవచ్చి, పొందిన పౌఖ్యం శూన్యం! ... విధి ప్రతికూలంగా ప్రవర్తిస్తే ఎవరుమాత్రం ఏమిచేయగలరు? ... బహుశా నీకిప్పుడు ఉద్యోగం లభించివుండవచ్చు; నీకు తగిన సంభంధం చూచుకొని నిశ్చింతగా జీవించు; నీకన్నా, ధనవంతుడు, రూప, విద్యా, గుణాల్లోగూడా నిన్నుమించిన 'రాజు' వల్ల జ్ఞానోదయం కల్గి, అతనితో వెళ్ళిపోతున్నాను.

నన్నుమరచిపో! ఇట్లు

రాజీ

అనివుంది!

♦ ♦ ♦

అవును ... నిజమే! ... అది రాజీదే నాకు బాగా గుర్తు!

ఆకేక వినిపించిన దిక్కునే వెళ్ళాను. అదొక అద్దాల మేడ; అద్దాలపైనుంచీ జారే వర్షపు చినుకులు ఆ మసక చీకటిలో తళ, తళ మెరుస్తున్నవి. చుట్టూ సుందరమైనతోట! అది వెదజల్లే, సువాసనలు అందుకొని, తన్మయుడయ్యాను. 'అమ్మా!' అన్న మృదు మధురమైన రాజీ కంఠం సూటిగా నిశ్శబ్దాన్ని చీల్చుకుని, నాచెవుల్ని నాటినది. వడిగాలోపలకు పరుగెత్తాను. వింత అలంకారాలతో గూడిన గదిలో, అందమైన లతలు చెక్కబడినవి. తివాచీపై అజంతాబొమ్మలాగ సుందరంగా మెలికలు తిరిగి పడివుంది నా 'హృదయేశ్వరి' రాజీ! పొట్టలో పిడివరకూ దించబడివుంది ఒక బాకు. ఆదృశ్యాన్ని చూసి నా గుండెబ్రద్ధలయింది. సమస్తభోగాలు కాదనీ, కోరి తెచ్చుకున్న కోమలి ఆ పరిస్థితులలోనుండటం నా హృదయం తట్టుకోలేక పోయింది. రక్తాన్ని చెమటగా మార్చి, నా అభివృద్ధికి తోడ్పడే నా తల్లితండ్రుల సైతం కాదని, కోరి పెళ్ళిచేసుకున్న 'నా హృదయేశ్వరిరాజీ' ఘోరంగా హత్యచేయబడటం సహించలేక పొయ్యాను. ఆవేశంలో నన్ను నేను పొడుచుకో బొయ్యాను. ఎవరివో రెండు చేతులు నన్ను బంధించినవి. వెనుకకు తిరిగి చూసేను ఎర్రటోపీలు కన్పించాయి. అంతే!'' నాగేశ్వరం కథ చెప్పటం ముగిసింది. చేసిన తప్పుకు చింతిస్తున్నాడు: ఆ నిర్భాగ్యుణ్ణి గూర్చి ఈ విశాల విశ్వంలో ఒక్కరైనా 'జాలి' పడరుగదా!